క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపన



పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తానూరు: మండలంలోని తొండాల గ్రామంలో ఇటీవల నిర్మించిన అన్నపూర్ణదేవి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. బబ్లూమహరాజ్, పింటు మహరాజ్ ఆధ్వర్యంలో హోమం జరిపించగా గ్రామస్తులు పూజలు చేశారు. అనంతరం మహాదేవుడి ఆలయంలో ధ్వజస్తంభం కార్యక్రమం నిర్వహించారు. బొశెట్టి రాజన్న, పోతారెడ్డి, పిరాజీ, ఆలయ కమిటీ చైర్మన్ కిషన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



సభ్యులకు విరాళం అందిస్తున్న రమేశ్

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి మండలంలోని అంబారిపేట్ గ్రామ మాజీ సర్పంచ్(ఎన్ఆర్ఐ)మెరుగు ఇంద్రసేనారెడ్డి రూ.21,116 లను విరాళంగా సమకూర్చారు. ఈ నగదును అంబారిపేట్‌కు చెందిన రమేశ్, సత్తెన్న బుచ్చన్న ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. సభ్యులు సతీశ్, రాజేందర్, రమేశ్, సాయివెంకటేశ్, శ్రావణ్, రేహన్ ఉన్నారు.

ఉపాధ్యాయుడి ఔదార్యం

మామడ: మండలంలోని కమల్‌కోట్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. పాఠశాలకే చెందిన ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి వేసవి శిబిరం నిర్వహణ కోసం వలంటీర్‌ను నియమించేందుకు రూ.6వేలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మన్మథ్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం సీజ్



భవనానికి నోటీసు అంటిస్తున్న అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో దిలావర్‌పూర్ ప్రధాన రహదారి పక్కన అక్రమంగా నిర్మించినభవనాన్ని కోర్టు ఆదేశాల మేరకు సీజ్ చేశామని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. మున్సిపల్ అనుమతి లేకుండా భవన నిర్మాణం చేసినట్లు హైకోర్టులో నమోదైన రిట్ పిటిషన్ ప్రకారం తెలంగాణ హైకోర్టు ఆదేశానుసారం గురువారం భవనానికి సీజ్ నోటీసు అంటించామని పేర్కొన్నారు. పట్టణ పరిధిలో ఇళ్లు, భవనాలను నిర్మించేవారు మున్సిపల్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని లేకుంటే చట్టం ప్రకారం అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుభీర్ ఎంపీడీవోగా సాగర్‌రెడ్డి

కుభీర్: మండల ఎంపీడీవోగా సాగర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన నవనీత్‌కుమార్ బుధవారం పదవీ విరమణ పొందారు. సాగర్‌రెడ్డి మామడ నుంచి బదిలీపై వచ్చారు. ఎంపీవో మోహన్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ రెహమాన్ ఉన్నారు.

సైనికుడికి సన్మానం



సైనికుడిని సన్మానిస్తున్న యువకులు

సారంగాపూర్: పదవీ విరమణ పొందిన సైనికుడిని మండలంలోని వైకుంఠాపూర్ గ్రామంలో గ్రామస్తులు, యువకులు గురువారం సత్కరించారు. వైకుంఠాపూర్‌కు చెందిన సైనికుడు ఎస్.ప్రకాశ్ 17 ఏళ్లపాటు దేశ సరిహద్దులో సైనికుడిగా పని చేశాడు. ఇటీవల పదవీ విరమణ పొంది స్వగ్రామానికి రాగా స్వాగతం పలికి సత్కరించారు.

పరామర్శ

సారంగాపూర్: మండలంలోని సోనాపూర్ తండాకు చెందిన తాజా మాజీ ఉప సర్పంచ్ జాదవ్ సంతోష్ తమ్ముడు గణేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే వారి కుటుంబాన్ని గురువారం మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. షేక్ షఫిక్, నాయకులు ఉన్నారు.

ఆవాసం సందర్శన

భైంసాటౌన్: పట్టణంలోని వివేకానంద అనాథ పిల్లల ఆవాసాన్ని భైంసా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.దేవేంద్రబాబు గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆవాసం రికార్డులు పరిశీలించి పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాల శుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీడబ్ల్యూసీ సభ్యులు, ఆవాసం కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఊరూరా మేడే వేడుకలు



భైంసాలో జెండా ఎగురవేస్తున్న బీడీ కాంగార్ యూనియన్ నాయకులు



ఖానాపూర్ : జెండా ఎగురవేస్తున్న నాయకులు



లోకేశ్వరంలో ఎర్రజెండా ఎగురవేస్తున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ముత్తన్న

జిల్లావ్యాప్తంగా గురువారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో అన్నివర్గాల కార్మికులు పాల్గొని ఎర్రజెండా ఎగురవేసి మాట్లాడారు. తమ హక్కులు హరించేలా ఉన్న లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భైంసాలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి హరిత, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రాజు..కార్మికులతో కలిసి ర్యా లీ నిర్వహించారు. భైంసాలోని వినాయక్‌నగర్‌లో బీడీ కాంగార్ యూనియన్ నాయకులు జెండా ఎగురవేశారు. లక్ష్మణచాంద మండలం వడ్యాల్‌లో టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న మే డే జెండాను ఎగురవేశారు. కుభీర్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ మిత్రమండలి ఆధ్వర్యంలో దుస్తులను పంపిణీ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ, ఏఐటీయూసీ, ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అన్ని వర్గాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



భైంసాలో ర్యాలీ తీస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు



కడెంలో..



కుంటాలలో నినాదాలు చేస్తున్న ఆశాకార్యకర్తలు



లక్ష్మణచాంద అమరవీరుల స్తూపం వద్ద..



కుభీర్‌లో మాట్లాడుతున్న మిత్రమండలి సభ్యుడు



ముధోల్ బస్టాండ్ ఆవరణలో..

'పది'లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ



రాజ్‌కుమార్



యువరాజ్



వినయ్



నరేశ్

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ మహాత్మా జ్యోతి బాపూలే గురుకులం(బాలురు)లో 75 మంది పదోతరగతి వార్షిక పరీక్షలు రాయగా వంద శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రాజ్‌కుమార్ 577, యువరాజ్ 568 మార్కులతో పాఠశాల టాపర్లుగా నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

భైంసాలో..

భైంసాటౌన్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల(బాలురు)పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాలకు చెందిన పుప్పాల్‌వార్ వినయ్ 586, మంతెన నరేశ్ 576 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కులగణన నిర్ణయంపై హర్షం



భైంసాలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



సారంగాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

భైంసాటౌన్: దేశవ్యాప్త కులగణన నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో మండలశాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశవ్యాప్త కులగణనతో అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని పేర్కొన్నారు. మండలాధ్యక్షురాలు సుష్మారెడ్డి, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, భీంరావ్, పండిత్ పటేల్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ లస్మన్న, సాయినాథ్ పాల్గొన్నారు.

సారంగాపూర్: దేశవ్యాప్తంగా కులగణన చేయాలని నిర్ణయించడం హర్షనీయమని బీజేపీ మండలాధ్యక్షుడు కాల్వ నరేశ్ అన్నారు. మండలకేంద్రంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చంద్రప్రకాశ్‌గౌడ్, సాహెబ్‌రావు, విలాస్, సామల వీరయ్య, చెన్న రాజేశ్వర్, రామారెడ్డి, తిరుమలచారి, రంజిత్, శేఖర్, నవీన్, లింగారెడ్డి, నారాయణరెడ్డి, శివరాం, సురేశ్ ఉన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించడం హర్షనీయమని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండల, పట్టణ అధ్యక్షులు ఉపేందర్, మనోజ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాయకులు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, అనిల్‌రావు, సత్యవతి, లింబాద్రి, రవి, వరుణ్, పవన్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



చెక్కు అందిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్మల్ నియోజకవర్గంలోని 43 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, నక్కా మధుకర్‌రెడ్డి, బొల్లోజి నర్సయ్య, భుజంగా శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు సోమా భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, పట్టణ అధ్యక్షుడు నందెడపు చిన్ను, వివిధ ఆలయాల చైర్మన్లు గంగోని భూరాజ్, భోజాగౌడ్, కొండ శ్రీనివాస్, కలీం, అర్షద్, ఈటల శ్రీనివాస్, వెంకటరమణారెడ్డి, గాజుల రవి కుమార్, దాసరి రమేష్, పాల్దే అనిల్, రమేశ్ పాల్గొన్నారు.

శ్రీహరిరావుని కలిసిన 'అడెల్లి' పాలకవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామంలో ఉన్న శ్రీ మహాపోచమ్మ ఆలయ పాలకవర్గం గురువారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుని నిర్మల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శ్రీహరిరావును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని పాలకవర్గానికి సూచించారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సయ్య ఉన్నారు.

సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి



వడ్యాల్‌లో విద్యార్థులతో ఎంఈవో అశోక్‌వర్మ



ఖానాపూర్‌లో శిబిరం ప్రారంభిస్తున్న కమిషనర్

లక్ష్మణచాంద: 14 ఏళ్లలోపు విద్యార్థులను శారీరకంగా, మానసికంగా బలంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం(సమ్మర్ స్పోర్ట్స్‌క్యాంపులు)ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో అశోక్‌వర్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల15 వరకు శిబిరం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. 25 మంది విద్యార్థులకో వలంటీర్‌ను నియమించారు. నిర్వాహకులు ఫిజికల్ డైరెక్టర్ వై.రమణారావు, వలంటీర్లు వంశీ, రచన, సీఆర్పీ సుధాకర్ తదితరులు ఉన్నారు.

తానూరు: విద్యార్థులకు క్రీడలు, నృత్యాలు, చిత్రలేఖనం వంటి అంశాల్లో శిక్షణ అందించేందుకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నరేందర్ పేర్కొన్నారు. మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిబిరాన్ని గురువారం కమిషనర్ కృష్ణ ప్రారంభించారు. జూన్ ఆరో తేదీ వరకు శిబిరంలో విద్యార్థులకు వెయిట్ లిఫ్టింగ్, కరాటే, వాలీబాల్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు పీడీ ఇమ్రాన్ తెలిపారు. చిన్నం సత్యం, కిరణ్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, పీఈటీ ఇర్ఫాన్, శిక్షకుడు ఆరిఫ్, సిబ్బంది ఉన్నారు.

ముధోల్: పాఠశాలల్లో గురువారం యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపులు ప్రారంభమయ్యాయి. ఈ క్యాంపులో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు క్రీడలు, సృజనాత్మక అభ్యాసాలు, శారీరక అభ్యాసాలు, విద్యాభివృద్ధి నేర్పనున్నట్లు ఎంఈవో రమణారెడ్డి తెలిపారు.

నేడు మార్కండేయస్వామి ఆలయ వార్షికోత్సవం

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉదయం పుణ్యాహవచనం, అంకురార్పణ, గణపతి పూజ, అవాహిత దేవతా హోమం, స్వామివారి కల్యాణం, అన్నదానం, సాయంత్రం విగ్రహాల ఊరేగింపు, తదితర కార్యక్రమాలు ఉంటాయని పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు బిట్లింగ్ నారాయణ తెలిపారు. సమీప ప్రాంతాల భక్తులు తరలివచ్చి స్వామి వారి కృపను పొందాలని ఆయన కోరారు.

1930కి ఫిర్యాదు చేయండి

భైంసారూరల్: సైబర్ మోసాలకు గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని ఎస్సై శంకర్ అన్నారు. గురువారం మండలంలోని దేగాం గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేస్తే ఓటీపీలు చెప్పవద్దని పేర్కొన్నారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తిర్పెల్లిలో కేంద్రం ప్రారంభిస్తున్న శ్రీనివాస్

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పంటను అమ్ముకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు భీమేశ్, సుభాశ్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి), రాంపూర్ గ్రామాల్లో డీఆర్డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీంరెడ్డి ప్రారంభించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, ఏపీఎం సునంద, ఏఈఓ గణేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లేశ్, గోవింద్‌రెడ్డి, అజీమ్, సీసీ ముత్యం, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం



భైంసారూరల్: విద్యార్థులను సత్కరిస్తున్న సిబ్బంది

మామడ: మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గురువారం హెచ్‌ఎం అరవింద్‌కుమార్ సన్మానించారు. 126 మంది పరీక్షలు రాయగా 125 మంది ఉత్తీర్ణులవగా.. 13 మంది 500 మార్కులకు పైగా సాధించారు. ఈసందర్భంగా ఆవరణలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కడెం: పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచిన మండలంలోని లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.జీవనజ్యోతి, వర్షిత, అర్చనలను గురువారం పాఠశాలలో సన్మానించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని హెచ్‌ఎం వెంకటరమణ పేర్కొన్నారు. ఇందులో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లత, ఉపాధ్యాయులు ప్రభాకర్, నర్సయ్య, వాల్గొట్ కిషన్, పోచయ్య, లక్ష్మణ్, జయంతి, తదితరులున్నారు.

విద్యార్థులకు అభినందన

భైంసారూరల్: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని మాటేగాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీజ 555 మార్కులు, హరిప్రియ 522, ధనుష్ 504 మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. హెచ్‌ఎం రమణారావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, వీడీసీ సభ్యులు రాజేశ్వర్, వెంకటేశ్, గ్రామస్తులు ఉన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- అందాకూర్ శివారు గోదాంకు కరువైన రోడ్డుమార్గం
- అలంకారప్రాయంగా మారిన వైనం
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన రైతులు



వర్షాకాలంలో చెరువులో నుంచి ప్రమాదకరంగా ఎడ్లబండిపై వెళ్తున్న రైతులు (ఫైల్)



అందాకూర్ శివారులో నిరుపయోగంగా గోదాం

కుంటాల: రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు.. వర్షాలు, క్రిమికీటకాల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం నిర్మించిన గోదాం (గిడ్డంగి)లు పలుచోట్ల నిరుపయోగంగా మారుతున్నాయి. అధికారులు అవగాహన లేక కుంటాల మండలంలోని అందాకూర్ గ్రామ శివారులో నిర్మించిన గోదాంకు రోడ్డు మార్గం కరువైంది. మా గ్రామంలో గోదాం ఉన్నా.. తమ పంటను నిల్వ చేసుకునే సౌకర్యం లేదని రైతులు వాపోతున్నారు.

గోదాం ఉన్నా నిరుపయోగమే..

కేంద్ర ప్రభుత్వ పథకం కింద రూర్బన్ నిధులు రూ.40లక్షలు మంజూరవగా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మాణ పనులు చేపట్టారు. 2021లో అప్పటి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శంకుస్థాపన చేయగా గతేడాది వేసవిలో పనులు పూర్తి చేశారు. కానీ రోడ్డు లేక గోదాంను వినియోగంలోకి తీసుకురాలేదు. ఈ గ్రామ రైతులు అందాకూర్ పెద్ద చెరువు అలుగు నుంచి గోదాంకు వెళ్లాల్సి ఉంటుంది. వర్షాకాలంలో చెరువు అలుగు వద్ద 4 నుంచి 5 ఫీట్ల లోతులో నీరు నిలిచి ఉంటుంది. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలంటేనే ఇబ్బంది పడతారు. మరోవైపు కల్లాలు లేకపోవడంతో ప్రైవేట్ స్థలంలో రోడ్డుపైన పంటలను ఆరబెట్టుకుంటున్నారు. ఇటీవల గ్రామానికి వచ్చిన కలెక్టర్ అభిలాష అభినవ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారని రైతులు పేర్కొన్నారు. గోదాంకు వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మించి గోదాంను వినియోగంలోకి తేవాలని రైతులు వేడుకుంటున్నారు.

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది



పెద్ద చెరువు అవతలి వైపు తమ పొలాలు ఉన్నాయి. అక్కడికి వెళ్లాలంటే రోడ్డు లేదు. వర్షాకాలంలో చెరువు నీటిలోంచి పశువులు, రైతులు ప్రమాదకరంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇబ్బంది పడుతున్నాం. – రమేశ్, అందాకూర్

దారి ఏర్పాటు చేయాలి



పంట ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేందుకు గోదాం నిర్మించారంటే సంతోషపడ్డాం. కానీ రోడ్డు లేని చోట నిర్మించడంతో గోదాం నిరుపయోగంగా మారింది. దారి ఏర్పాటు చేసి కల్లాలు కూడా నిర్మించాలి. – మల్లేశ్, అందాకూర్

రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు

గోదాంకు రోడ్డు మార్గం లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధితశాఖ అధికారులతో చర్చించి గోదాముకు రోడ్డు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటాం. – లింబాద్రి, ఎంపీడీవో, కుంటాల

పాత పద్ధతిలోనే బస్సులు నడపాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మామడ: పాత పద్ధతిలోనే తమ గ్రామానికి బస్సు నడపాలని కోరుతూ గురువారం మండలంలోని కొరిటికల్ గ్రామస్తులు నిర్మల్‌లో ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందించారు. గతంలో గ్రామానికి 8 ట్రిప్పులు ఆర్టీసీ బస్సు నడిచేదని.. ప్రస్తుతం తగ్గించడంతో గ్రామస్తులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో వీడీసీ చైర్మన్ ఏలేటి లింగారెడ్డి, సభ్యులు ఎర్రోళ్ల నర్సారెడ్డి, చిప్ప భూమయ్య, బండి చిన్నయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.